చెవిపోగులు లేకుంటే పశువులకు ఇబ్బందులు

● పశు సంవర్ధక శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య

నారాయణపురంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య

చిలుకూరు, మార్చి 21 : చెవి పోగులు లేకుంటే పశువులకు భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురవుతాయని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని నారాయణపురంలో పశువులకు చేపట్టిన గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మనుషులకు ఆధార్ నంబరు ఎలాగో పశువులకు ప్రత్యేక గుర్తింపు కార్డు సంఖ్య కలిగిన బార్ కోడ్ చెవి పోగులు అంతేనని అన్నారు. జిల్లా వ్యాప్తంగా గాలికుంటు వ్యాధుల నివారణ టీకా కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి వీరారెడ్డి, సిబ్బంది పరిమళ, వెంకటేశ్వర్లు, నరేశ్, సైదులు పాల్గొన్నారు.

సాగర్ నీటిని విడుదల చేయాలి : జడ్పీటీసీ సైదిరెడ్డి

వేపలసింగారంలో ట్యాంకర్ వద్ద నీటి కోసం తంటాలు పడుతున్న ప్రజలు

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 21 : వేసవి ఆరంభం నుంచే హుజూర్‌నగర్ మండలంలోని గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడి నెలకొన్నది. ముఖ్యంగా లింగగిరి, వేపలసింగారం, గోపాలపురం, బూరుగడ్డ గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి, చెరువులు, బావులు, బోర్లు ఎండిపోయి నీటి కోసం ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. అరకొరగా గ్రామాల్లో ట్యాంకర్లతో సరఫరా చేసినా నీటి కొరత మాత్రం తగ్గడం లేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి సాగర్ ద్వారా నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపి భూగర్భ జలాలకు పెంపునకు కృషి చేయాలని జడ్పీటీసీ కొప్పుల సైదిరెడ్డి డిమాండ్ చేశారు.

భువనగిరి ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుంటాం

● బీఆర్ఎస్ మండల కార్యదర్శి సుందర్

సమావేశంలో మాట్లాడుతున్న సుందర్

అర్వపల్లి, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి ఎంపీ స్థానాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని పార్టీ మండల కార్యదర్శి జీడి సుందర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం తిమ్మాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలన ఎంతో ప్రజలకు అర్థమైందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ గొంతుక వినిపించే పార్టీ బీఆర్ఎస్ కావునా ప్రజల దృష్టి బీఆర్ఎస్ వైపు మళ్లినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు భిక్షం, జీడి నర్సయ్య, రాంబాబు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక

ప్రమాణ స్వీకారం సంఘం సభ్యులు

మఠంపల్లి, మార్చి 21 : మండల కేంద్రంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీ ఎన్నిక గురువారం జరిగినట్లు మత్స్య శాఖ రిజిస్టర్ అశోక్ కుమార్ తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా తవిడబోయిన నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా తుంగం వీరయ్య, కార్యదర్శిగా చింతల వీరబాబు, జాయింట్ సెక్రటరీగా చింతల లక్ష్మీనారాయణ, కోశాధికారిగా తవిడబోయిన కృష్ణ, డైరెక్టర్లుగా కర్నె సైదమ్మ, బుద్ధి సక్కుబాయమ్మ, చాగంటి నరసింహరావు, తవిడబోయిన వీరయ్యను ఎన్నుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు చింతల గురువయ్య, సంఘం పెద్దలు కంటు లక్ష్మయ్య, కర్నె వెంకటేశ్వర్లు, చింతల సత్యం, కీసర పెద నాగయ్య, పులుసు శ్రీను, తవిడబోయిన కృష్ణ, వేముల శ్రీకాంత్, కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో విద్యార్థులు

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

ఆత్మకూర్.ఎస్, మార్చి 21 : మండల పరిధిలోని ఏపూరు ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒక్క రోజు ప్రజా ప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులుగా అలరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జాఫర్ షా అలీ, వెంకట్‌రెడ్డి, పద్మ, రేణుక, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫణిగిరి బ్రహ్మోత్సవాల్లో స్వామివారు

ఫణిగిరి సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నాగారం, మార్చి 21 : రాష్ట్రంలో రెండో భద్రాద్రిగా వెలుగొందుతున్న మండలంలోని ఫణిగిరి సీతారామచంద్రస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు గ్రామస్తులంతా మంగళ హారతులు, డప్పు వాయిద్యాలతో గ్రామ వీధుల గుండా సీతా రామచంద్రస్వాములు వేంచేయగా కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ గట్టు లక్ష్మీకాంత్, వైస్ చైర్మన్ కల్లెట్లపల్లి సోమయ్య, యాదగిరి, భిక్షం, నాగమణి, శంకరయ్య, రవీందర్, ఆచార్యులు కూరేశం సంతోష్‌కుమార్, సాయిదత్తు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

మునగాల : మునగాలలో నీటి ట్యాంక్‌ను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకట్రావ్

మునగాల, మార్చి 21 : జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో తాసీల్దార్ కార్యాలయం, గణపవరం రోడ్డులో వృథాగా ఉన్న నీటి ట్యాంక్‌లను పరిశీలించి అధికారుల నుంచి వివరాలు సేకరించి మాట్లాడారు. గ్రామాల్లో బోర్లు రిపేర్ ఉంటే వెంటనే వాటికి మరమ్మతులు నిర్వహించి వినియోగంలోని తేవాలని సూచించారు. మండలంలో ఎక్కడైనా నీటి ఎద్దడి ఉంటే తక్షణమే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అధికారులు మండలంలో క్షేత్రస్థాయిలో పర్యటించి నీటి సమస్యపై నివేదికను తయారు చేసి కలెక్టరేట్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ అంజనేయులు, ఎంపీఓ భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : వేసవి దృష్ట్యా మండల వ్యాప్త గ్రామాల్లో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో గ్రామానికి సమీపంలో వ్యవసాయ బోర్లు ఉన్నట్లయితే సదరు రైతుల సహకారంతో నీటిని ఇంటింటికి అందించాలన్నారు. అలాగే వైరల్ ఫివర్ రాకుండా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, తాసీల్దార్ మహేందర్‌రెడ్డి, ఎంపీఓ నరేశ్, వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భిక్షం

మేళ్లచెర్వు : వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. నీటి ఎద్దడి ఉన్న చోట ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. ఆయన వెంట యల్లయ్య, ఖాజామియా ఉన్నారు.

నేరేడుచర్లలో ఎండలతో నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

మండతున్న ఎండలు

35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు

నేరేడుచర్ల , మార్చి 21 : ఈసారి ఎండలు మండుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గురువారం నేరేడుచర్లలో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ నెలలో ఇప్పటి వరకు 33 డిగ్రీల నుంచి 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతూ వస్తున్నది. భానుడి తీవ్రత ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఎలా ఉంటుందోనని అంతా చర్చించుకుంటున్నారు. ఉదయం 10 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. దాంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండల తీవ్రతకు జనం శీతల పానీయాలు, మజ్జిగ, పుచ్చకాయల వైపు మొగ్గు చూపుతున్నారు. పట్టణంలోని మిర్యాలగూడ, కోదాడ బస్ స్టాప్స్ వద్ద ఎటువంటి నీడ లేక ప్రయాణీకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాతలు లేదా అధికారులు

ముందుకు వచ్చి ప్రయాణీకులకు నీడ కోసం షెడ్లను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుద్దాల అశోక్ తేజ

కవులకు సమాజంలో గుర్తింపు దక్కడం లేదు

● ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ

బొడ్రాయిబజార్, మార్చి 21 : నేటి సమాజంలో కవులకు సరైన గుర్తింపు దక్కడం లేదని ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. గురువారం కవిత్వ దినోత్సవం సందర్భంగా మనమ్ వికాస్ వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేశ్ ఆధ్వర్యంలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాలాజీగ్రాండ్‌లో ఏర్పాటు చేసిన సుద్దాల అశోక్ తేజతో ఓ సాయంత్రం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సుద్దాల హనుమంతు జానకమ్మల డీఎన్ఏ తనదని, తన తల్లిదండ్రులే తనకు స్ఫూర్తి అన్నారు. పాట, పని ఒకేసారి పుట్టినట్లు తెలిపారు. నాడు నన్నయ, ఎర్రప్రగడ, తిక్కనకు దక్కిన గౌరవం అన్నమయ్యకు దక్కలేదన్నారు. 1958లో సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తన నాన్న సుద్దాల హనుమంతు ఎన్నికల ప్రచారం సమయంలో ఆయన సభ కోసం సినిమా థియేటర్ మొదటి షో ను ఆపిన రోజులున్నాయని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అశోక వనం, శుద్ర గంగావదానం అనే రెండు కావ్యాలను రాస్తున్నట్లు, వాటిని త్వరలోనే ప్రజల ముందుకు తేనున్నట్లు చెప్పారు. ప్రముఖ జర్నలిస్ట్, కవి ప్రసేన్ మాట్లాడుతూ.. పాట సమాజానికి ఎంతో స్ఫూర్తినిచ్చి చైతన్య పరుస్తుందని, అలాంటి పాటలు రాయడంలో అశోక్ తేజ దిట్ట అని కొనియాడారు. శ్రీశ్రీ, వేటూరి పక్కన నిలబడడమే కాకుండా వారితో పాటు జాతీయ స్థాయి అవార్డు దక్కించుకున్న ఘనత సుద్దాల అశోక్ తేజది అన్నారు. అనంతరం అశోక్ తేజతో పాటు గాయకులు బుర్రి వెంకటేశ్వర్లు, సరిత, విజయ, గుండా రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త మీలా మహదేవ్, కక్కిరేణి చంద్రశేఖర్, పెద్దిరెడ్డి రాజా, గండూరి రమేశ్, మనమ్ వికాస్ వేదిక సభ్యులు, కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

● సీపీఎం నాయకులు

మోతె, మార్చి 21 : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు పంతంగి పెద్దమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు అన్నారు. గురువారం మండలంలోని బుర్కచర్ల గ్రామంలో నిర్వహించిన పెద్దమ్మ సంతాప సభలో ఆయన మాట్లాడారు. పెద్దమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, అబ్బగాని భిక్షం, సీపీఎం నాయకులు లక్ష్మమ్మ, సామ్రాజ్యం, మరియమ్మ, వెంకటమ్మ, పుల్లమ్మ, రాములమ్మ, నర్సయ్య, గోపాల్, లింగమ్మ, రమేశ్ పాల్గొన్నారు.

దొండపాడు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల ముమ్మర తనిఖీ

చింతలపాలెం, మార్చి 21 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా సరిహద్దుల్లో పటిష్టమైన చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ సైదిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దొండపాడు వద్ద వాహనాల తనిఖీ చేపట్టి మాట్లాడారు. ఆధారాలు చూపించకుండా తరలించే నగదు, నగలు, ఇతరత్రా సొత్తును సీజ్ చేసి సంబంధిత అధికారులకు అప్పగిస్తామని తెలిపారు. ఎన్నికల నిబంధన మేరకు రూ.50 వేలకు మించి నగదు తీసుకు వెళ్లొద్దన్నారు. అనంతరం మండల కేంద్రంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

విద్యార్థులకు ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ కృష్ణ

విద్యార్థులకు ఫిజియోథెరపీ

నూతనకల్, మార్చి 21 : ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో గురువారం ఫిజియోథెరపీ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ కృష్ణ ప్రత్యేక అవసరాల పిల్లలకు సెల్‌బ్రల్ పాల్సీ ఎక్సర్‌సైజ్‌లను, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 15 మంది దివ్యాంగ విద్యార్థులను పరిశీలించి ఎక్సర్‌సైజ్‌లను నేర్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాములునాయక్, హెచ్ఎం విద్యాసాగర్, ఐఈఆర్పీ అప్పారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో భారీగా అవకతవకలు

● తుంగతుర్తి మండల సామాజిక తనిఖీలో రూ.4,45,517 రికవరీ గుర్తింపు

ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

తుంగతుర్తి, మార్చి 21 : మండలంలో మూడో విడుత చేపట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో భారీగా అవినీతి జరిగినట్లు, బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని డీఆర్‌డీఏ పీడీ మధుసూదన్‌రావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెంలో రూ.7,450, గానుగుబండ-6 వేలు, మానాపురం-6,400, రావులపల్లి ఎక్స్‌రోడ్-11 వేలు, సింగారంతండా-5,700, గొట్టిపర్తి-4 వేలు, కాశీతండా-9,300, రామన్నగూడెం-8,870, యేనెకుంటతండా-12,175, గుడితండా-1,000, సూర్యతండా-7 వేలు, బాపన్‌బాయితండా-4,691, బండరామారం-11,194, మంచితండా-78,297, సంఘెం-29,182, అన్నారం-8,031, వెంపటి-2 వేలు, తూర్పుగూడెం-4 వేలు, వెలుగుపల్లి-20,356, కేశవాపురం-3,961, రావులపల్లి-24 వేలు, దేవునిగుట్టతండా-12,253, తుంగతుర్తిలో అత్యధికంగా 1,32,903, మొత్తంగా మండలంలో రూ.4,45,517 రికవరీని గుర్తించినట్లు వెల్లడించారు. ఇందుకు బాధ్యులైన ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారి శైలజ, ఎంపీడీఓలు శేషుశర్మ, భీమ్‌సింగ్‌నాయక్, ఏపీఓ వెంకన్న, ఆనంద్, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐడీఏ జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ మహేశ్

మహేశ్

బొడ్రాయిబజార్, మార్చి 21 : ఇండియన్ డెంటల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన పెద్దిరెడ్డి మహేశ్ 2024-25 సంవత్సరానికి ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం స్థానిక ట్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాగబండి కిరణ్‌కుమార్ మహేశ్ చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే కార్యదర్శిగా డాక్టర్ చిప్పలపల్లి అరుణ్‌కుమార్, కోశాధికారిగా డాక్టర్ దేవరశెట్టి దినేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శివ సంతోష్, హుజూర్‌నగర్, కోదాడ, తుంగతుర్తి, తిరుమలగిరి ప్రాంతాల డెంటల్ డాక్టర్లు హాజరయ్యారు.

హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాంరెడ్డి

రాంరెడ్డి

హుజూర్‌నగర్, మార్చి 21 : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాముల రాంరెడ్డి గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జక్కుల వీరయ్య, ఉపాధ్యక్షుడిగా జక్కుల నాగేశ్వర్‌రావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా వెంకటేశ్, కోశాధికారిగా బానోతు సురేశ్, లైబ్రరీ కార్యదర్శిగా విశ్వనాథ్, కార్యవర్గ సభ్యులుగా యాదగిరి, నాగార్జున, ప్రశాంత్, రామినేని వెంకటేశ్ ఎన్నికయ్యారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నేరేడుచర్ల, మార్చి 21 : మండలంలోని ముకుందాపురం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మూడు గంటలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పందిరి శ్రీనివాస్ గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని ముకుందాపురం ఫీడర్ విద్యుత్ లైన్ల కింద చెట్ల కొమ్మలు తొలిగించే పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గృహ, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు పేర్కొన్నారు.

చిల్పకుంట్ల గ్రామ మిషన్ భగీరథ ప్లాంట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

● మిషన్ భగీరథ కార్మికులు

నూతనకల్, మార్చి 21 : మిషన్ భగీరథలో పని చేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ గురువారం మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో మిషన్ భగీరథ ప్లాంట్ ఎదుట కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య మాట్లాడుతూ.. ఐదు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదన్నారు. రాష్ట్రంలో 16 వేల మందికి పైగా కార్మికులు ఉన్నారని, వారికి సకాలంలో వేతనాలు చెల్లించక పోవడంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు తెలిపారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతున్నా కార్మికులకు కనీస వేతనాలు మాత్రం అందడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ కార్మికులు కుసు ఉప్పులయ్య, పగిల్ల నాగరాజు, బత్తుల హరికృష్ణ, గంట రామకృష్ణ, జటంగి శేఖర్, రాము, సైదులు, ఉపేందర్, మహేశ్, సంపత్ పాల్గొన్నారు.

వెలిదండలో ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు

ఎండిన పంటలకు నష్ట పరిహారం అందించాలి

● అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య

గరిడేపల్లి, మార్చి 21 : ఎండిన పంటలకు ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య అన్నారు. మండలంలోని వెలిదండ గ్రామంలో గురువారం సంఘం డివిజన్ కార్యదర్శి మేకల కనకారావుతో కలిసి ఎండిన వరి పొలాలను పరిశీలించి మాట్లాడారు. రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారని, చివరి దశలో బోర్లు, బావుల్లో నీరు ఎండిపోవడంతో వారు బాగా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. కావున ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అలాగే ధాన్యం అమ్ముకోవడంలో ఇబ్బందులు కలుగకుండా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మాశెట్టి అంజయ్య, సాంబయ్య, నాగేశ్వర్‌రావు, శ్రీను, బ్రహ్మయ్య, పీతర్, సైదులు, రమేశ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

నగదు రికవరిలో విమర్శలకు తావిస్తున్న పోలీసుల తీరు

కోదాడ రూరల్, మార్చి 21 : కోదాడ పట్టణ పోలీస్ పెట్రోల్ బంక్‌లో ఈ నెల 11వ తేదీన రూ.12 లక్షలు అపహరణకు గురయ్యాయి. బంక్ సూపర్‌వైజర్ హనుమారెడ్డి నగదును తీసుకుని పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని మూడు రోజుల క్రితం ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తాను కొంతమందికి అప్పులు ఉండడంతో ఆ నగదును చెల్లించినట్లు హనుమారెడ్డి తెలిపాడు. దాంతో నిందితుడు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆయా వ్యక్తుల ఇండ్లకు వెళ్లి పోలీసులు నగదు రికవరికి చర్యలు చేపట్టారు. అయితే హనుమారెడ్డి ఈ నెల 8వ తేదీకి ముందే తమకు అప్పు చెల్లించినట్లు, అపహరణకు గురైన నగదుతో తమకు సంబంధం లేదని పలువురు వాపోతున్నారు. అదంతా తమకు తెలియదని బంక్ డబ్బులు చెల్లించాల్సిందేనని పోలీసులు హుకుం జారీ చేశారు.

దాంతో హనుమారెడ్డి బాధితులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.